కథ

## శివల పద్మ

# ఇది నా జీవితం

"మేం కాసేపలా వాకింగ్‌కి వెళ్లి వస్తాం. వాళ్ల హోమ్‌వర్క్ కాస్త కంప్లీట్ చేయించండి" భర్తకి చెప్పింది శార్వాణి.

"కేరీ ఆన్... చాలా రోజులకి మీరిద్దరూ కలిశారుగా... నామీద చెప్పాల్సిన కంప్లయింట్స్ బోలెడుంటాయి" నవ్వుతూ అన్నాడు శ్రీధర్.

"పుచ్చకాయల దొంగంటే భుజాలు తడుముకున్నాట్ట... మీలాంటివాడే...."

నీరజ నవ్వుకుంది వారి సంభాషణకి. ఆమెకి శ్రీధర్ సంస్కారం పట్ల ఎనలేని గౌరవం! చాలా నెమ్మదస్తుడు, మృదుస్వభావి.

మేనమామ కూతురికి మంచి మొగుడు దొరికాడని సంతోషపడుతూ ఉంటుంది.

బయట సన్నటి మంచు కురుస్తోంది. అయినా ఆ చలిలో నడవడం కూడా బాగుంది. ఆ మాటకొస్తే కబుర్లు చెప్పుకుంటూ నడవడం వారిద్దరికీ చిన్నప్పట్నుంచి చాలా ఇష్టమైనది.

చాలా క్షణాలు మౌనంగానే గడిచాయి.

"ఇష్టమైనవాళ్లు పక్కనుంటే నిశ్శబ్దం కూడా బోర్ కొట్టదు కదూ!"

"మాటలకన్నా వారి సమక్షమే మనకి అపురూపం అయినప్పుడు అది నిజం!"

"నాకు నీ సమక్షం ఎప్పుడూ అపురూపమే..."

"నాకెందుకో నా పక్కన మరో పేరు కూడా చేరుతున్నట్టు అనిపిస్తోంది."

శార్వాణి మౌనంగా ఉండిపోయింది.

"నువ్వీ రోజు ఉపవాసం ఎందుకు చేశావు?" ప్రశ్నించింది నీరజ.

"అదే గురువారం... నీకుగానీ, శ్రీధర్‌కి గానీ అలవాటు లేదుగా? చెప్పు... ఎవరే సుధాకర్? ఏమిటి నీ సమస్య?"

"పెళ్లయిన ఆడది ఇంకెవరినీ ప్రేమించకూడదా?"

"ఎవరన్నారూ? ఎంతమందినైనా ప్రేమించవచ్చు. జీవితాన్ని సమస్యల సుడిగుండంలోకి చేజేతులా నెట్టి- ఆనక తీరిగ్గా వాటికి దారులు వెతకాలనుకుంటే..."

"ఇద్దరు పిల్లలు పుట్టాక జీవితం చాలా రొటీన్ అయిపోయిందే... అసలు మా లైఫ్ ఇంకేం లేనట్లుగా తయారైంది. నా ఇష్టాలు నా ఎమోషన్స్ నా చిన్న చిన్న కోరికలు ఏవీ శ్రీధర్‌కి గుర్తు లేవు. ఆ ఇంటికి నేనే నమ్మకమైన పనిమనిషిని అంతే... అన్నిచోట్లా ఒక యాంత్రికత... లేదా డామినేషన్... ఏమిటిది? నాకంటూ ఒక జీవితం ఉందా?... అని నన్ను నేను ప్రశ్నించుకుంటున్న తరుణంలో "ఉంది" అంటూ సుధాకర్ నా జీవితంలోకి వచ్చాడు. బండబారిపోయిన నా ఎమోషన్స్‌లో తిరిగి జీవం పోశాడు. నా సరదాలు అర్థం చేసుకున్నాడు. నాతో సమానంగా నా ఇష్టాలను ఎంజాయ్ చేశాడు. జీవితాన్ని అందంగా ఆహ్లాదంగా మార్చాడు. నేనెందుకు అతన్ని ప్రేమించకూడదు?

ఆఫ్ట్రాల్ నేనూ మనిషినే. నాకూ ఆత్మీయతా, ఆప్యాయతా కావాలనిపిస్తుంది. అవి తను అందిస్తుంటే నేను స్పందించకుండా ఎలా ఉండను? ఈమాత్రం అటెన్షన్ శ్రీధర్ నాకు ఇవ్వగలిగితే ఈ పరిస్థితి వచ్చేది కాదుగా? పెళ్లి అన్న తంతు పూర్తవ్వగానే టేకెన్ ఫర్ గ్రాంటెడ్‌గా తీసేసుకోవడమేనా?"

నిట్టూర్చింది నీరజ.

"ఇప్పుడేం చేద్దామనుకుంటున్నావు?"

శార్వాణి నిరుత్తరురాలైంది.

"నాకు తెలుసు. దీనికి సమాధానం నీ దగ్గర ఉండదని... కట్టుకున్నవాడిని వదిలేసి నచ్చినవాడితో లేచిపోతాను" అని చెప్పే తెగింపు ఇంకా నీలో వచ్చినట్టు లేదు."

తీక్షణంగా చూసింది శార్వాణి.

"కోపం ఎందుకే... ఇక్కడ రెండే దారులు. రాజీపడి మొగుడితో ఉండడం, తెగించి రెండోవాడితో లేచిపోవడం. ఇదే మగవాళ్లనుకో... వాళ్లకి మూడో దారి కూడా ఉంటుంది. దాగినన్నాళ్లు దాచి ఇద్దర్నీ బాలన్స్ చేయడం... చివర్లో రెండవదానికి విషాదంగా వీడ్కోలు ఇచ్చి మొదటిదాని పక్కకి వెళ్లిపోయి మంచి మొగుడు అనిపించుకోవడం. ఖర్మగాలి మనకా ఆప్షన్ కూడా లేదే... ఎందుకంటే మన పతిదేముడికి బయట ఎన్ని అఫైర్లున్నా తిరిగి వస్తే హారతివ్వడానికి మనం రెడీగా ఉంటాం. కానీ వాళ్లలా కాదు. కనుక ఆలోచించు..."

"దీన్లో ఆలోచించడానికేముంది? నాకు తను నచ్చాడు. తను నన్ను అర్థం చేసుకున్నాడు. మాకొకరి సమక్షం ఒకరికి నచ్చుతోంది. నాకు తన స్నేహం ఆత్మీయతా కావాలి... ఏం ఇదే నేను తనను పట్టించుకోకపోతే శ్రీధర్ వెళ్లడా? నేనెక్కడ బాధపడతానో అని ఆగిపోతాడా?" ఉక్రోషంగా అడిగింది శార్వాణి.

"ఆగడనే నేనూ చెపుతున్నాను" అంది ఎదురుగా ఒక సిమెంటు బెంచీ కనిపిస్తే పోయి దానిమీద కూర్చుంది నీరజ.

"శారూ! మనం ఉక్రోషం పట్టలేక ఎన్నిసార్లు కంపేర్ చేసుకున్నా మనం మనమే..."

"అసలు ముందు మనలని మనం పూర్తిగా మార్చుకోవాలి అని నా ఉద్దేశం. మనం వ్యక్తిత్వాల కన్నా సెంటిమెంటుకి ఎక్కువ ప్రాధాన్యతనిస్తాం. ఆ వెర్రి కాస్త తగ్గించుకోవడం అవసరం. మగవాడు దీనంగా ముఖం పెట్టి నాలుగు వెధవ డైలాగులు చెప్పగానే కరిగి నీరైపోవడం ఏళ్లతరబడి రిపీటెడ్‌గా మనం చేస్తున్న తెలివితక్కువ పని. ఒక్కసారి ఆలోచించు. మన ఒంటరితనానికి మరో మగవాడే తోడు కావాలా? మన అశాంతిని కేవలం మరో మగవాడే దూరం చేయాలా? మన ఇష్టాలని మరో మగాడు మాత్రమే అర్థం చేసుకోగలడా? నేనూ నీకు ఆత్మీయురాలినే... నీ అశాంతిని, ఒంటరితనాన్ని నాతో ఎందుకు పంచుకోలేకపోయావు? ఎందుకు మరో మగాడితోనే ఆ 'తోడు' నీకు దొరికింది?


పెళ్లయిన మగాడని తెలిసినా మరో ఆడది కూడా అంతే డీప్‌గా ఆ మగవాడిని ఆరాధించగలదంటే ఇది మన ఖర్మ కాకపోతే ఇంకేమిటి? దౌర్భాగ్యం కాకపోతే ఇంకేమిటి?

కట్టుకున్నదానికే విలువ ఇవ్వక నీ దగ్గరకి వచ్చినవాడు, కట్టిన తాళికీ దైవసాక్షికీ విలువ ఇవ్వనివాడు రేపు నీకేం విలువ ఇస్తాడు?

నీ సుధాకర్ నీకు చాలా అటెన్షన్ ఇస్తాడని మురిసి ముక్కలైపోతున్నావు. తన భార్యకి ఇవ్వాల్సిన అటెన్షన్ మానేసే కదూ నీకిస్తున్నాడు? అదెందుకు గుర్తుపట్టవు?

వివాహానికి, దాంపత్య బంధానికి మనం ఎంత విలువ ఇస్తామో వాళ్లూ అంతే ఇవ్వాలి. మనకెంత కమిట్‌మెంట్ ఉందో వాళ్లకీ అంతే ఉండాలి.

అలాగాక వాళ్లు భార్యని కాదని మన దగ్గరకి వచ్చి మళ్లీ ఏమిటీ వివక్ష? ఆడదాని పట్ల ఎందుకు అన్యాయం? అంటూ గొంతు చించుకుని మరీ అరుస్తాం.



పద్నాలుగో ఏట నుంచి ప్రారంభం అవుతుంది ఈ జబ్బు. ఈ జాలి జబ్బు...

అందుకే మగవాడు చెప్పే మాయ మాటలకి పరవశించిపోతూ విని ఆనక జీవితాలను నాశనం చేసుకున్నారు ఎందరో ఆడపిల్లలు.

పోనీ వాళ్లయితే చిన్నపిల్లలు, ప్రపంచ జ్ఞానం లేనివారు అనుకోవచ్చు. కానీ ఈనాడు విద్యాధికులై ఉద్యోగాలు చేస్తున్న ఎందరో ఆడపిల్లలు వివాహితులైన మగవారి పట్ల ఆకర్షితులవుతున్నారు.

"అందరు మగవాళ్లూ అలానే అని ఎందుకనుకోవాలి? నిజంగా భార్యల వలన బాధ పడుతున్నవారై ఉండవచ్చు కదా?"

జాలిగా ఆమెని చూసి నవ్వింది నీరజ.

"ఈ అతి నమ్మకమే మనలని అధోగతికి తీసుకువెళ్తోంది. ప్రతి మగవాడూ తన భార్యతో తాను నరకం చూస్తున్నానని, నీ తోడులోనే సాంత్వన పొందానని- నువ్వు లేకుంటే ఈ జీవితం ఎప్పటికీ ఎడారిగానే మిగిలిపోయేదనే చెపుతాడు. కానీ ఒక్కసారి కామన్‌సెన్స్‌తో ఆలోచించు. నెంబర్ వన్- తన భార్యతో తనకి సుఖం లేకపోతే విడాకులిచ్చి మరో వివాహితని డైవోర్సీని గానీ, విడోని గానీ పెళ్లి చేసుకోవాలి. అంతే తప్ప పెళ్లి కాని ఆడపిల్లని తన వలలోకి లాగడం ఏమిటి? అంటే తాను సెకండ్ హాండ్ అయినా దొరికేది మాత్రం ఫ్రెష్‌గా ఉండాలి. కదా!

ఓ.కె. కనీసం ఈ పెళ్లికాని ఆడపిల్లనైనా- తన భార్య నుంచి విడిపోయి వివాహం చేసుకుంటాడా? అదీ చేయడు. మళ్లీ ఆ తలనొప్పులు నచ్చవు.

మరోలా చెప్పాలంటే అక్కడ మొదటి భార్య పతివ్రత! తను ఎలాంటి అఫైర్స్ పెట్టుకున్నా నోరు మెదపదు.

ఇక్కడ దొరికిన రెండోదా? ఇదో బకరీ... నాలుగు సెంటిమెంటల్ డైలాగులతో పడగొట్టవచ్చు. అలాంటి ఆడపిల్లలు అందుబాటులో లేకపోతే మరో వివాహిత కావాలి. దాని జీవితంలో నిప్పులు పోయడానికి... ఇంతకన్నా ఏ మగాడికైనా ఏం కావాలి చెప్పు? ఈ విధంగా ఇద్దరేసి ఆడవాళ్లని ఒకేసారి అన్యాయం చేస్తున్న మగవాడిని అటు సమాజమూ అంగీకరిస్తుంది. ఇటు మనమూ నెత్తిన పెట్టుకుంటాం. ఇప్పుడు చెప్పు మార్పెక్కడ రావాలో..."

శార్వాణి ఆలోచనలో పడింది. కొద్ది క్షణాలు ఏమీ మాట్లాడలేదు.

"రెండవది- ఒక రొటీన్‌కి అలవాటు పడితే జీవితమూ యాంత్రికమవుతుంది. జీవితం ఇలా కాక ఇంకెలా ఉంటుంది? దీన్లో మార్పు కావాలంటే అది ప్రయత్నించి నువ్వు తెచ్చుకోవాలి. ఆ సంసారం మీ ఇద్దరిదీ. పిల్లల బాధ్యతలు కూడా మీ ఇద్దరివీ. అలాంటప్పుడు నీకెంత యాంత్రికత అనిపిస్తుందో శ్రీధర్‌కీ అంతే అనిపించవచ్చుగా. అదెప్పుడైనా పరిశీలించావా? తన అటెన్షన్ నీపట్ల తగ్గింది అన్నది నీ కంప్లయింట్. పిల్లలు పుట్టక మునుపు నువ్వు తనకిచ్చిన అటెన్షన్ ఇప్పుడు ఇవ్వగలుగుతున్నావా? బాధ్యతలతో పాటు జీవిత వర్ణాలు కూడా మారుతాయి. అయినా అన్ని వర్ణాలనూ పట్టి ఉంచేవి సంసారమనే ఇంద్రధనుస్సే..."

"చుట్టూ తిరిగి నాకు పతివ్రతా ధర్మాలు చెపుతున్నావు" వ్యంగ్యంగా అంది శార్వాణి.

"పొరపాటు పడుతున్నావు. అన్నిటికన్నా ముందు

వ్యక్తిత్వాన్ని నిలుపుకోమంటున్నాను. నీ పరిధిలో నువ్వుండడం అనేది భర్త కోసమో, సమాజం కోసమో కాదు- నీలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుకోవటానికి. మనం చాలా మారాలి శారూ! మన ఆలోచనా విధానాలు, వ్యక్తిత్వంలో మార్పు వచ్చిన రోజు, ఈరోజు స్త్రీలకి ఎదురవుతున్న అనేక సమస్యలకి పరిష్కారం దొరుకుతుంది. నీ సమస్య విషయానికి వస్తే నిన్ను పెళ్లి చేసుకోమని ఎవరూ బలవంతం చేయలేదు. చేసుకున్నాక వచ్చే మార్పులను అంగీకరించాలి. మీలో మీరు చర్చించుకోవాలి. పరిష్కరించుకోవాలి. అతడు తప్పుదారి పడితే నువ్వు నిలదీయాలి. నీ ఆలోచనలు తప్పుదారి పట్టకుండా నువ్వు చూసుకోవాలి. నీకు జీవితం బోర్ అనిపిస్తే ఉద్యోగం మానేసి వేరే వ్యాపకం ఏదైనా కల్పించుకో. సమయాన్ని సద్వినియోగం చేయి. చేతినిండా పని కల్పించుకో. ఇంటి బాధ్యత, పిల్లల బాధ్యత ఎలానూ ఉండనే ఉంటుంది. వారితో సమయం గడుపు. వారి గ్రోత్‌కి అంతకన్నా విలువైంది ఏముంటుంది?

వైవాహిక బంధం అనేది పిల్లల యాంగిల్లో చూసినా, భర్త యాంగిల్లో చూసినా ఒక కమిట్‌మెంట్‌తో కూడుకున్నది. భార్యాభర్తలిద్దరికీ కూడా. ఆ కమిటెడ్ లైఫ్‌లోకి అడుగు పెట్టాక దానికి లోబడి ఉండాలి. సమాజం ఇచ్చే దన్నుతో దురదృష్టవశాత్తూ కొందరు మగవాళ్లు ఆ కమిట్‌మెంట్‌కి విలువ ఇవ్వరు. కానీ అది తప్పు. ఆ తప్పు ఎవరు చేసినా తప్పే.

నీతులు చెపుతున్నాననుకోకు. విచక్షణతో ఆలోచించు. సుధాకర్‌తో నీ సంబంధానికి గమ్యం ఏమిటి? కొన్నాళ్లు అతడితో ఆత్మీయంగా ఉన్నాక తర్వాత ఏదైనా సమస్య వస్తే నువ్వు మళ్లీ ఏం జరగనట్లుగా శ్రీధర్‌తో నార్మల్‌గా ఉండగలవా? ఏ మగవాడినీ నీ ఎమోషన్స్‌తో ఆటలాడుకోనివ్వకు శారూ! ఎవరిని ఎక్కడ ఉంచాలో అక్కడ ఉంచు.

నేను చెప్పాల్సింది చెప్పాను. జీవితాన్ని అస్తవ్యస్తం చేసే ఎమోషన్స్‌నీ, సెంటిమెంట్స్‌నీ వదిలిపెట్టు. మన శ్శాంతి విలువ దాన్ని పోగొట్టుకోక ముందే తెలుసుకో."

శార్వాణి మౌనంగా విన్నది. నీరజ మాటల్లోని వాస్తవాన్ని ఆమె వివేకం గ్రహించుతోంది.

నీరజ చెప్పినది నిజమే. జీవితానికో లక్ష్యం, గమ్యం లేనప్పుడే ఈ ఉద్వేగాలు ప్రధానం అవుతాయి. ఈ ఎమోషన్స్ కన్నా బలమైన లక్ష్యం ముందున్నప్పుడు, ఏకాగ్రత అంతా ఆ లక్ష్యసాధనే అయినప్పుడు ఈ అక్కర్లేని భావోద్వేగాలు ఏమీ ఉండవు. వాటికి సమయమూ ఉండదు.

"శారూ! కళ్యాణ్‌నగర్‌లో ఉన్న మా ఇల్లు నీకిస్తాను. ఆ టెనెంట్స్‌ని వెకేట్ చేయమని చెపుతాను. అందులో ఓ నలుగురు వృద్ధులతో వృద్ధాశ్రమం ప్రారంభించు. ఆ నలుగురినీ నేనూ, నా ఫ్రెండ్స్ దత్తత తీసుకుంటాం. నువ్వు కేవలం వారి సంరక్షణ చూడు. అలాంటి వ్యాపకంలో ఉండే సంతృప్తి ఏమిటో నువ్వే తెలుసుకో.

ఆ రోజు నీ మనస్సులో ఉండే సంతృప్తి ముందు ఇలాంటి వందమంది సుధాకర్‌లు కూడా నిన్ను ఎమోషనల్‌గా కదల్చలేరు. ఆలోచించి నిర్ణయం తీసుకో. నా దృష్టిలో ఎమోషన్స్ కన్నా జీవితం విలువైనది. మనస్సు కరిగి మన కంటి చివరన చేరే చెమరింపుకి కూడా అవతలివాడికి అర్హత ఉండాలి. కనబడిన ప్రతివాడి కోసం కార్తీక దీపాలు వెలిగించే అలవాటు మంచిది కాదు."

సుధాకర్ కోసం తను ఉపవాసం చేయడం గురించే ఆ చురక అని అర్థమైంది శార్వాణికి. కానీ ప్రియనెచ్చెలి మాటల కారణంగా మనస్సు ఏదో తేలిక అవుతున్న అనుభూతి! దారి తెలియనివాడికి ఏదో దారి దొరికిన అనుభూతి!

అంతకు మించి నిశ్శబ్దంగా మనస్సులో చోటు చేసుకున్న ఆత్మవిశ్వాసం!

తానేం ఒంటరి కాదు. తానేం వ్యథలలో లేదు. తనకు ఎవరి ఓదార్పు, సాంత్వనా అవసరం లేదు.

తనకి విద్య ఉంది. విచక్షణ ఉంది. మంచి కుటుంబం ఉంది. తన మీద ఆధారపడే ముగ్గురు ఆప్తులున్నారు. తన జీవితం విలువ లేనిది కాదు.

తన జీవితంలో నిస్సారాన్ని, యాంత్రికతను తను దూరం చేసుకోవాలే తప్ప ఆ ప్రయత్నంలో విష వలయంలో చిక్కుకోకూడదు...

వగైరా వగైరా భావాలన్నీ మనస్సుని కమ్ముకుంటుంటే నీరజ చేతిని తన చేతిలోకి తీసుకుని కృతజ్ఞతాపూర్వకంగా నొక్కింది.

"థాంక్‌యూ నీరూ!" అంది. అంతే.

నీరజకి అర్థమైంది.

"అంత అవసరం లేదు. నీ జీవితాన్ని సన్మార్గానికి మళ్లించడానికి వచ్చిన దేవదూతని కాను నేను. నేనూ మనిషినే. ఆకర్షణలనేవి ఒక్కోసారి మనం ఊహించలేనంత బలంగా ఉంటాయి. అవి తగ్గుముఖం పట్టాక వాస్తవం చేదుగా ఎదుట నిలుస్తుంది.

ఎన్నో జీవితాలు ఇలాగే అస్తవ్యస్తం అయ్యాయి. కొద్దిపాటి మానసిక నియంత్రణ ఉంటే జీవితం సాఫీగా గడిచిపోతుంది. మనకి ఆత్మస్థైర్యం, నిబ్బరం కావాలి.

పెళ్లి, మగవాడు, ఇవన్నీ జీవితంలో కొన్ని భాగాలు మాత్రమే. దీనికి మించి కూడా జీవితం ఉంది. దాన్ని మన కోసం జీవించాలి.

కమాన్... జీవితాన్ని ఎంజాయ్ చెయ్యి... గర్వంగా నీ హక్కులని నువ్వు అనుభవించు- ఆత్మవిశ్వాసంతో నిండుగా..."

శార్వాణి భుజం చుట్టూ చేయి వేసి ఉల్లాసంగా నవ్వింది నీరజ. ఆమె అరచేతిని ప్రేమగా ముద్దుపెట్టుకుంది శార్వాణి.

శరత్కాలపు వెన్నెల వారిరువురినీ అభిషేకిస్తోంది!

## తెలివైన భావన

ఇప్పుడిప్పుడే తమిళ రంగంలో తనదైన ముద్ర వేసుకుంటున్న కుర్ర హీరోయిన్ భావన తెలుగులో గోపీచంద్ సినిమా 'ఒంటరి' ద్వారా పరిచయమవుతోంది. చూడ్డానికి హోమ్లీగా వుండి, అలాంటి తరహా పాత్రలే పోషిస్తుందేమోననే సందేహం అందరికీ కలుగుతుందని గ్రహించిన భావన ఇప్పుడు తనే స్వయంగా నిర్మాతలకి తను మోడర్న్ దుస్తులు కూడా ధరించి నటిస్తాను అని ప్రత్యేకంగా చెబుతోందిట. భవిష్యత్తులో దర్శకత్వం నిర్వహించాలనే కోరిక వున్న భావన అమాయకురాలేం కాదు, తెలివైనదే అంటున్నారు ఇది విన్నవాళ్లు.

